క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన



సత్తెనపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానంతో విద్య అందించాలని ఐసీడీఎస్ సత్తెనపల్లి సీడీపీఓ టి.శ్రీలత అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ ఆరు రోజులపాటు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏసీడీపీఓ సంతోష కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలకు పునాది వేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. సూపర్‌వైజర్ పి.ప్రమీల మాట్లాడారు. చిన్నారులకు ఏ విధంగా బోధించాలనే అంశంపై డీఆర్పీలు శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లిలో వేంచేసియున్న పోలేరమ్మతల్లి ఆలయ 17వ వార్షికోత్సవం బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి మంగళవాయిద్య సహిత తోరణ, సుప్రభాత సేవ, గణపతి పూజ, బ్రహ్మ కలశారాధన, పంచామృత సహిత ఏకాదశ ద్రవ్యాలతో శ్రీ పోలేరమ్మ తల్లికి, దేవతా మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. 11 గంటల నుంచి దివ్య అలంకరణ అనంతరం దివ్య దర్శనం, శ్రీ చక్ర సహిత దుర్గా సహిత శ్రీ సూక్త సమేతంగా అమ్మవార్లకు దివ్య కుంకుమ పూజ, సహస్రనామ పుష్పార్చన, గాజుల అలంకార సేవ, విశేష పూజా కార్యక్రమాలు, ధూప దీప నైవేద్య సహిత తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం భజన సంకీర్తనలు, లలితా సహస్ర నామ పారాయణం, దీపోత్సవం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంపద కేంద్రం పరిశీలన



నకరికల్లు: ఒక ప్రణాళిక ప్రకారం వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని నర్సింగపాడు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. డీపీఆర్‌సీ బృందంతో మాట్లాడి ఎస్‌డబ్ల్యూపీసీ పనితీరును అడిగి తెలుసుకున్నారు. తడిచెత్తను పొడిచెత్తను స్వయంగా వేరు చేశారు. వర్మీతొట్లను, నాడెప్‌తొట్లను, ఆకు కూరలు వేసిన ప్రదేశాలను పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు. ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కొమ్మవరపు అప్పారావు, ఇంజినీరింగ్ సిబ్బంది, హరిత రాయబారులు పాల్గొన్నారు.

'పది'లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



రాజుపాలెం: పదవ తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ సుబ్బారావు తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను, గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల ప్రగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పరీక్షల విధానంపై సూచనలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణా తరగతులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ నరసింహారావు, హెచ్ఎం భూలక్ష్మీ, రిసోర్స్ పర్సన్స్ రామారావు, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి ఆదరణ అంతంతమాత్రమే!

- అమరావతి నుంచి గుంటూరుకు పల్లె వెలుగు సర్వీసులు మాత్రమే..
- గుంటూరు చేరుకునేందుకు గంటన్నరపైగా ప్రయాణం
- ప్రమాదమని తెలిసినా ఆటోలను ఆశ్రయిస్తున్న భక్తులు, పర్యాటకులు
- ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని వినతి



అమరావతి దుర్గావిలాస్ సెంటర్‌లో ప్రయాణికుల కోసం ఆగిఉన్న మ్యాజిక్ ఆటోలు

అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రంగా, బౌద్ధ పర్యాటక కేంద్రంగా ప్రఖ్యాతి చెందిన అమరావతికి చేరుకునేందుకు పర్యాటకులు, భక్తులు గతంలో ఆర్టీసీని ఆశ్రయించేవారు. అయితే రానురాను సెవన్ సీటర్ (మ్యాజిక్) ఆటోలు ఆ స్థానాన్ని ఆక్రమించాయి. ప్రమాదమని తెలిసినా ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని ఆశ్రయిస్తున్నారు.

వామ్మో బస్సులా..?

గతంలో ఆర్టీసీ లిమిటెడ్ స్టాపులతో నడిపే ఎక్స్‌ప్రెస్ సర్వీసులను అమరావతికి నడిపేవి. అయితే నేడు ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు స్వస్తిచెప్పిన ఆర్టీసీ కేవలం పల్లెవెలుగు సర్వీసులు మాత్రమే గ్రామానికి నడుపుతోంది. ఈ సర్వీసుల వల్ల మధ్యలో ఉన్న గ్రామాలవారికి, గుంటూరు నగర పరిధిలోని గోరంట్ల వరకు ఉన్నవారికి ఉపయోగకరంగానే ఉన్నా అమరావతికి త్వరగా వెళ్దామనుకునే వారి సహనాన్ని మాత్రం పరీక్షిస్తున్నాయనే చెప్పాలి. గుంటూరు నుంచి అమరావతికివచ్చే బస్సు సుమారు 20కి పైగా స్టాపులలో ఆగుతూ ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. గతంలో మ్యాజిక్ ఆటోల హవా తగ్గించటానికి సమయపాలన, వేగంతోపాటు సౌకర్యంగా ఉన్న మెట్రోబస్ సర్వీసులను నడిపిన ఆర్టీసీ కొన్నాళ్లకు నష్టాల సాకుతో వాటిని రద్దు చేసింది.

పెద్ద ఆటోలదే హవా

అమరావతి నుంచి ప్రతి అర్థ గంటలకు ఆర్టీసీ బస్సు సర్వీస్ నడుపుతున్నా సమయపాలన, సకాలంలో గమ్యం చేర్చలేకపోవటంతో బస్సుల్లో ప్రయాణానికి ప్రయాణికులు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. అమరావతి నుంచి గుంటూరు, గుంటూరు – అమరావతి వెళ్లేందుకు మ్యాజిక్ ఆటోలపైనే ప్రజలు ఎక్కువగా ఆధారపడుతున్నారు.

బస్సులో గంటన్నరపైగా పడుతోంది



అమరావతి నుంచి గుంటూరుకు బస్సులో వెళ్లాలంటే గంటన్నరపైగా పడుతుంది. అదే ఆటోలో 50 నిమిషాల్లోనే గుంటూరు చేరుకుంటాం. ఆటో ప్రయాణం ప్రమాదమని తెలిసినా సకాలంలో వెళ్లాలంటే వెళ్లక తప్పటం లేదు. గతంలో ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నప్పుడు బస్సుల్లో ప్రయాణం చేసేవాళ్లం. ప్రస్తుతం ఆటోలో వెళుతున్నాం.

– దారా ప్రసాద్, పట్నం మాలపల్లి, అమరావతి

గతంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తిరిగే రోజుల్లో అమరావతి నుంచి గుంటూరుకు 15 మ్యాజిక్ ఆటోలు తిరిగితే నేడు సుమారు 50నుంచి 60 మ్యాజిక్ ఆటోలు తిరుగుతున్నాయి. ఆర్టీసీ బస్సులకు ఆదరణ మరింత దిగజారకముందే అధికారులు మేల్కొని ఎక్స్‌ప్రెస్, మెట్రో సర్వీసు బస్సులను నడపాలని పలువురు కోరుతున్నారు.

కొన్ని గ్రామాలకైనా బస్సులు నడపాలి..

మండలంలో పెద్ద గ్రామాలలో ఒకటైన అత్తలూరుకు అమరావతి మీదుగా ఆర్టీసీ గతంలో ఒక సర్వీసు నడిపేవారు. ప్రస్తుతం ఆ సర్వీస్ రద్దు చేయడం వల్ల గ్రామస్తులు అమరావతి రావాలంటే ఆటోలో ప్రయాణించటం లేక జూపూడి వరకు నడిచి వెళ్లి అక్కడి నుంచి క్రోసూరు-గుంటూరు బస్సు ఎక్కాల్సివస్తుంది. అదేవిధంగా గుంటూరు నుంచి 14వ మైల్, ఉంగుటూరుల మీదుగా నెమలికల్లు వరకు నిన్న మొన్నటివరకు ఒక బస్సు సర్వీస్ నడిపి దాన్నికూడా నష్టాల సాకుతో నిలిపివేశారు. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా అమరావతి మండలంలోని గ్రామాలలో సర్వే నిర్వహించి ప్రజల అభిప్రాయం మేరకు బస్సులు నడపాలని పలువురు కోరుతున్నారు.

బస్టాప్ లేక ఇబ్బందులు..

ఆదేవిధంగా అమరావతిలో బస్టాప్ లేక ప్రయాణికులు, భక్తులు అనేక యాతనలు పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్డుపై నిలబడాల్సిందే. లేకుంటే దుకాణాల వద్ద, హోటళ్ల ముందు నిలబడాల్సి వస్తుంది. గతంలో అమరేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో ఉండే బస్టాప్‌ను పోలీస్ అవుట్‌పోస్టుగా మార్చటంతో భక్తులు నిలుచుండేందుకు నీడ కరువైంది. వృద్ధులు, మహిళలు, పిల్లలు నిలబడలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక క్షేత్రమైన అమరావతిలో కనీసం బస్టాప్ లేకపోవటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బస్టాపు లేక బస్సుల కోసం రోడ్డుపై వేచియున్న ప్రయాణికులు

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



రాజుపాలెంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సమన్వయకర్త గజ్జెల సుధీర్ భార్గవ్‌రెడ్డి

- ప్రతీ కార్యకర్తను కలుస్తా, అండగా ఉంటా
- కూటమి చేస్తున్న అరాచకాలను ఎదిరిద్దాం
- వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త గజ్జెల సుధీర్ భార్గవ్‌రెడ్డి

రాజుపాలెం: ప్రతీ ఒక్కరు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జెల సుధీర్ భార్గవ్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యకర్తల ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గజ్జెల సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గానికి తనను సమన్వయకర్తగా నియమించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తాను నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో తిరుగుతానని, ప్రతీ కార్యకర్తను కలుసుకుంటానని తెలిపారు. కూటమి చేసే అరాచకాలకు ఎవ్వరు అధైర్య పడవద్దని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రతీ కార్యకర్త గ్రామాల్లో తలెత్తుకుని తిరిగే విధంగా మీ వెన్నంటే ఉంటానని తెలిపారు. పార్టీకోసం కష్టపడిన వారిని మరిచిపోనని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలపై చేసిన దాడులకు రాబోయే కాలంలో అదేవిధంగా బుద్ధి చెబుదామన్నారు. నియోజకవర్గ పరిశీలకులు సాంబశివరెడ్డి మాట్లాడుతూ దాడులు, అఘాయిత్యాలతో కూటమి నేతలు పేట్రేగుతున్నారని, ఎవరినీ వదిలే ప్రసక్తేలేదన్నారు. జగనన్న సీఎం అయ్యేందుకు ప్రతీ కార్యకర్త చెమటోడ్చి పనిచేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, ఎంపీపీ తెలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ మర్రి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జంగం నరసింహారావు, చెవుల స్వామి, వైస్ ఎంపీపీ హరి సూరమ్మ నాగేశ్వరరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బూదాటి సీతారాములు, ఎస్టీ సెల్ అధ్యక్షులు మాజీ సర్పంచ్ తులసీనాయక్, మాజీ ఎంపీపీ వేల్పుల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, ప్రత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ఏడీఏ హనుమంతరావు

అచ్చంపేట: వచ్చే నెలలో కేంద్రప్రభుత్వం విడుదల చేసే పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమకావాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా కలిగి ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు తెలిపారు. మండలంలోని కోనూరు, కస్తల గ్రామాలలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయ భూములు కలిగిన రైతులంతా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, ఆధార్‌లింకైన ఫోను నెంబరుతో రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు. అన్నదాత సుఖీభవ నగదు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర ప్రభుత్వ రాయితీలు పొందాలన్నా, పండించిన పంటలను మద్దతు ధరలకు అమ్ముకోవాలన్నా విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏఓ పి.వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ సిబ్బంది హర్ష, షరీఫ్, రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో...

క్రోసూరు: మండలంలోని నాగవరం ,హసనాబాద్ గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ఏఓ వేణు గోపాల్ పాల్గొని మాట్లాడారు. ఈ రబీ సీజన్‌లో మండలంలో రైతులు వరి, శనగ, మొక్కజొన్న, పొగాకు మొదలగు పంటలను సాగు చేశారన్నారు. ఈ–పంట యాప్ ద్వారా ఈ–క్రాప్‌ను రైతు సేవా కేంద్ర సిబ్బంది నమోదు చేస్తున్నారని చెప్పారు. ఈ–క్రాప్ చేయించుకోవడానికి ఈనెల 25 వ తేదీ ఆఖరు తేదీఅని, పంటలు వేసిన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి వారు వేసిన ఈ–క్రాప్ నమోదై ఉందా, లేదా సరి చూసుకోవాలని కోరారు. రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కస్తలలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ

కండ్లకుంట, చాగల్లులో...

నకరికల్లు: రబీసీజన్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులు రైతుసేవ కేంద్రాల్లో సంప్రదించి ఫార్మర్ ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని కండ్లకుంట, చాగల్లులో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో 11 అంకెల ఫార్మర్ రిజిస్టర్ ఐడీ నంబర్ పొందాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.శ్రీను, వీహెచ్ఏ కె.వెంకటకృష్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు, చాగంటివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తొంది కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని మాట్లాడారు. రైతులకు గుర్తింపు సంఖ్య కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. 11 అంకెల గుర్తింపు సంఖ్య వస్తుందని, రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు, సర్వే నెంబర్, ఫోన్ నెంబర్ తీసుకొని గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

సత్తెనపల్లి: పట్టణంలోని 25వ వార్డు మహారాష్ట్ర వీధిలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానం ఎదురు నూతనంగా నెలకొల్పిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వీట్‌లు పంపిణీ చేసి బాణసంచా కాలుస్తూ పూలమాలలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ పులహరి భానుజీ, బాలాజీ స్వీట్స్ అధినేత బాలాజీ, యోగా గురువు రమేష్, దేవరశెట్టి రవికుమార్, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో .....

పట్టణంలోని మహారాష్ట వీధిలో బీసీ సంఘ నాయకులు మంగళపురి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంఘం నాయకులు శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ లౌకిక పాలకుడని, ఆయన అన్ని మతాలకు అనుకూలంగా ఉండి, అన్ని మతాల ప్రజలను సమానంగా పరిపాలించాడన్నారు. బీసీ సంఘాల నాయకులు పులహరి బానోజీ, గుంటూరు గోవింద్, గుంజి విజయ్ కుమార్, కుమ్మరి దస్తగిరి, చింకా అంకమ్మరావు, పిక్కిలి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు జెడ్పీ హైస్కూల్‌లో...

పెదకూరపాడు: ఛత్రపతి శివాజీ ధర్మ పరిరక్షకుడని పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం రమణ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి మహారాష్ట్ర వీధిలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న వక్తలు



ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నమస్కరిస్తున్న శిశు విద్యామందిర్ చిన్నారులు

అమరావతిలో...

అమరావతి: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని బుధవారం స్థానిక శ్రీ సరస్వతీ శిశు విద్యా మందిర్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు, పూలతో నివాళులర్పించారు. హెచ్ఎం కోలా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆనాడు ఔరంగజేబు దురాగతాలను ధైర్యంగా ఎదుర్కొని ఎందరో భారతీయులను సంరక్షించి ధర్మస్థాపన చేసిన శివాజీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్పునకు ఎంపిక



సాయి జస్వంత్ కుమార్

రాజుపాలెం: మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి బొరిగర్ల సాయి జస్వంత్‌కుమార్ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సుగుణమణి బుధవారం తెలిపారు. విద్యార్థికి వచ్చే ఏడాది నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఏడాదికి రూ.12వేల స్కాలర్‌షిప్ కేంద్రప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని తల్లిదండ్రులు వెంకట్రావు, ఆదిలక్ష్మిలు, ఉపాధ్యాయులు అభినందించారు.

పశువుల దొంగలు అరెస్టు

వెల్దుర్తి: పశువుల దొంగతనం చేస్తూ, వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సా చేస్తున్న ముగ్గురు దొంగలను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురజాల డీఎస్పీ జగదీష్ బుధవారం వివరాలు వెల్లడించారు. మండలంలోని కండ్లకుంటకు చెందిన సూదెనబోయిన ఏసుబాబు, గొలసం శ్రీకాంత్, కొత్త పుల్లారెడ్డి గూడేనికి చెందిన ఐనబోయిన శ్రీకాంత్ అడవికి మేతకు వెళ్లిన పశువులను దొంగిలిస్తుంటారు. వాటిని ఒక చోటకు చేర్చి వాటిని విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఎస్ఐ సమందర్ ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకొని, విచారించగా దొంగిలించిన పశువులు ఉన్న చోటను చూపించారు. పది ఆవులు, నాలుగు గేదెలు, రెండు ఎడ్లను వెల్దుర్తి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. స్టేషన్‌లో ఫిర్యాదిచ్చిన బాధిత పశుపోషకులకు తమ పశువులను గుర్తించాలని అప్పగించటం జరిగిందన్నారు. కొత్తపుల్లారెడ్డి గూడేనికి చెందిన మక్కెన శంకర్ తన ఎడ్లు దొంగిలించారని ఈ నెల 6న ఫిర్యాదిచ్చినట్లు తెలిపారు. శిరిగిరిపాడు చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టడంతో ముగ్గురు దొంగల సమాధానం అనుమానాస్పదంగా ఉండటంతో మంగళవారం వారిని అరెస్టు చేయడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. దొంగలను పట్టుకున్న ఎస్ఐ సమందర్ వలి, సిబ్బందిని, రూరల్ సీఐ షేక్ నసీబ్ బాషాను డీఎస్పీ అభినందించారు.

ఆదర్శ, కస్తూర్బా పాఠశాలల్లో తనిఖీలు

బాలికలకు పలు అంశాలపై అవగాహన, పాఠశాలల్లో పరిస్థితులు తెలుసుకున్న అధికారులు

క్రోసూరు: ఏపీ ఆదర్శ పాఠశాల, కసూర్బా గాంధీ బాలికల పాఠశాలలను బుధవారం తహసీల్దార్ వీవీ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు, ఎస్ఐ నాగేంద్రరావులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాలు, టెక్ట్స్‌బుక్స్, వసతులు, చదువులు, సెక్యూరిటీపై ఏమైనా సమస్య లున్నాయా అనే అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఆరోగ్య పరీక్షలు, ఉచిత వైద్యం ఉంటుందా, ఏఎన్ఎం ఉంటున్నారా అనే అంశాలు అడిగి తెలుసుకుని పలు అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో, పాఠశాల బయట బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా బాలికలకు ఎటువంటి సమస్యలొచ్చినా అది పాఠశాలలో గానీ, పాఠశాల బయట గానీ తోటివారు, ఉపాధ్యాయులు తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అప్పుడు మాత్రమే జరగబోయే ప్రమాదాల నుంచి కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. హాస్టళ్లలో చదువుకునే బాలికలు ఒకరికొకరు స్నేహంగా, సహకారంతో మెలగాలని, సమస్యలేమైనా ఉంటే ఉపాధ్యాయులు, హెచ్ఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మేరీ సూజన్. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏపీ మోడల్‌స్కూల్ బాలికలతో మాట్లాడుతున్న తహసీల్దార్, డీటీ, ఎస్ఐలు

రామకృష్ణ పరమహంస బోధనలు ఆదర్శణీయం

మాచర్ల : భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస బోధనలు అందరికీ ఆదర్శణీయమని, ఛత్రపతి శివాజీ ధైర్యానికి ప్రతిరూపమని స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో రామకృష్ణ పరమహంస 190వ, ఛత్రపతి శివాజీ 395వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు

సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల సమస్యలను తాను గతంలో చాలా సార్లు పరిష్కరించానని, అపరిష్కృత సమస్యల పరిష్కారానికి మళ్లీ గళమెత్తి కృషి చేస్తానని కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సత్తెనపల్లి వచ్చిన ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పల్నాడు జిల్లాలోని వరికపూడి సెలకు ఎత్తిపోతల పథకం అమలు చేయాలని గతంలో డిమాండ్ చేశానన్నారు. పాఠశాలల్లోని సమస్యలను అనేక సార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లానన్నారు. నిరుద్యోగులు, గ్రూప్–2 అభ్యర్థుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మిక సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా తాను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలోని గ్రాడ్యుయేట్లు, మేధావులు ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ తొలి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించవలసిందిగా కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు వాలియా నాయక్, సత్తెనపల్లి మండల అధ్యక్షుడు తాజుద్దీన్, సీఐటీయూ సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ ఉన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

సత్తెనపల్లిలో విస్తృత ప్రచారం..

సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్‌లో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కెఎస్ లక్ష్మణరావుకు న్యాయవాదులు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీం వర్కర్లు ఘన స్వాగతం పలికారు. కెఎస్ లక్ష్మణరావుకు యూటీఎఫ్, సీఐటీయూ, రైతు సంఘం, తదితర ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, న్యాయవాదులు పిన్నమ నేని పాములయ్య, బత్తిన శ్రీనివాసబాబు, అంకాళ్ల వెంకటేశ్వర్లు, సయ్యద్ అబ్దుల్ రహీం, నాయకులు గద్దే చలమయ్య, పెండ్యాల మహేష్, గుంటూరు మల్లేశ్వరి, తదితరులు ఉన్నారు.

ఇవేనా మరమ్మతులు?



లంకెలకూరపాడు వెళ్లే దారిలో నెలరోజులకే తారు లేచి బయట పడ్డ కంకర రాళ్లు

మండలంలో వేసిన తారు రోడ్ల మరమ్మతులు మూణ్నాల ముచ్చటగానే మారాయి. నెల గడవక ముందే తారు లేచి కంకర బయటపడుతుంది. వివరాల్లోకి వెళితే.. సంక్రాంతికి ముందు కూటమి ప్రభుత్వం రహదారుల మరమ్మతులకు పూనుకుంది. అందులో భాగంగా లంకెలకూరపాడు, నార్నెపాడు గ్రామాల్లోని పలు రహదారులపై పనులు చేశారు. అయితే నెల తిరక్కముందే గుంతలపై వేసిన తారు లేచి, కంకర రాళ్లు ప్రత్యక్షమయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో టైర్లు జారి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాహనచోదకులు వాపోతున్నారు.

– ముప్పాళ్ళ

వాసవీమాత ఆలయ వార్షికోత్సవం



అచ్చంపేట: స్థానిక అచ్చంపేటలోని ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ 29వ వార్షికోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజామునే మంగళవాద్యాలు, మంగళ తోరణాలు, సుప్రభాతం, విఘ్నేశ్వర పూజ, పుణ్యహవాచన, అఖండ దీపారాధన, మంటపారాధన, కలశ స్థాపన చేపట్టారు. అర్చన కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి జెండా ప్రతిష్టాపన, జ్యోతిప్రజ్వలన చేపట్టారు. అనంతరం జై వాసమాంబ, జై కన్యకాంబ, జై ఏకాహ నామ సంకీర్తనా పారాయణ ప్రారంభించారు. ఈ నామాన్ని 24గంటల పాటు భజనకార్యక్రమ రూపంలో నిర్వహిస్తామని దేవస్థాన కమిటీ సభ్యుడు సూరే సుబ్బారావు తెలిపారు. గురువారం సైతం వేడుకలు కొనసాగుతాయని చెప్పారు.